నిరుద్యోగులకు పచ్చటోపీ !

- నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ
- ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీస్తున్న నిరుద్యోగులు
- భృతి కోసం ఆశగా ఎదురుచూపులు



ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు



తుని: గత ఎన్నికల్లో కూటమి నేతలు బాబు వస్తే జాబ్ వస్తుంది.. లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు గుప్పించారు. ప్రజలు నమ్మి ఓట్లు వేశారు. ప్రభుత్వం ఏర్పడింది. రెండు హామీలు ఎప్పటి లోగా అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని నిరుద్యోగులు నిలదీస్తున్నారు. చంద్రబాబు వాగ్దానాలు కార్యరూపం దాల్చేంతవరకూ పక్కాగా అమలు అవుతాయని చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే 2014 ఎన్నికల్లో జాబ్ కావాలంటే బాబు రావాలంటూ హడావుడి చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక నియోజకవర్గానికి పట్టుమని వంద మందికి కూడా ఉద్యోగాలు కల్పించలేక పోయారు. ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. మూడేళ్లు దాకా కాలయాపన చేశారు. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి వచ్చిన ఆరోపణలను తట్టుకోలేక ఎన్నికలకు ముందు 10 శాతం మందికి భృతి ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉపాధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. వైఎస్సార్ సీపీ యువతను పట్టించుకోలేదని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదంటూ చంద్రబాబు గత ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఉద్యోగాల కల్పన, మిగిలిన వారికి నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా ఇంకా నిరుద్యోగులకు ఎటువంటి తీపి కబురు అందలేదు. బాబు వస్తే తమ కష్టాలు తొలుగుతాయని భావించి నిరుద్యోగులకు ఎదరు చూపులు తప్పడం లేదు.

నియోజకవర్గంలో 74250 కుటుంబాలు

తుని నియోజకవర్గం పరిధిలోని తుని,తొండంగి, కోటనందూరు మండలాలు, పట్టణంలో 74250 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉన్నారు. వీరంతా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలపై ఎప్పుడు తీపికబురు చెబుతుందోనని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఉద్యోగం కల్పించకపోతే నిరుద్యోగ భృతి వస్తోందని ఆశిస్తున్నారు. తుని పురపాలక సంఘం పరిధిలో 14,650, తుని మండలంలో 16,441, కోటనందూరులో 13,500, తొండంగిలో 29659 కుటుంబాలు ఉన్నాయి. అయా కుటుంబాల్లో అర్హులందరికీ ఉద్యోగ, నిరుద్యోగ భృతిని కల్పించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకుంటారో త్వరగా చెప్పాలని ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

నిరుద్యోగులకు మొండిచేయి

ఏలేశ్వరం: నిరుద్యోగులను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడం చంద్రబాబు నైజమని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా భృతి ఇస్తామని ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అది నమ్మి నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం విజయంలో కీలకపాత్ర పోషించారు. తీరా అధికారం చేపట్టిన తరువాత నిరుద్యోగ భృతిపై పెదవి విప్పకపోవడంతో నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుమారు 82 వేల కుటుంబాలు ఉండగా సుమారు 20 వేలకు పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

కిర్లంపూడి: జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 21 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్టు అంచనా. 2014 ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. అప్పట్లో నిరుద్యోగులకు జాబులు రాలేదు కాని, ఆఖరి సంవత్సరంలో నిరుద్యోగ భృతి ఇచ్చారు. గత ఎన్నికల్లో ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి లేదా ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరితగతిన నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువత కోరుతున్నారు.

ఉద్యోగాలు కల్పించాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి. లేకుంటే నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలి. 2014లో హామీ ఇచ్చి తర్వాత మాట మార్చినట్లు ఇప్పుడు చేయకూడదు. మీరు ఇచ్చిన మాటను ప్రజలు నమ్మి ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు ఎప్పటి లోగా అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలి. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేస్తాం.

–దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తుని

హామీలు నెరవేర్చాల్సిందే..



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఎన్నికల్లో నిరుద్యోగులకు ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా ఇచ్చిన హామీ ఊసే ఎత్తడం లేదు. ఒక్కో నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి, ఇంటికో ఉద్యోగం ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలి.

–తోట నరసింహం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జగ్గంపేట

ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలి



కూటమి నేతలు ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా ఇప్పటివరకు నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. డిగ్రీ చదివి గత కొంత కాలంగా ఏ విధమైన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగం లేక ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే కొంత వరకూ మేలు జరుగుతుంది.

బొడ్డు రవి, నిరుద్యోగి, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం

నిరుద్యోగ భృతి విధి విధానాలు ప్రకటించాలి



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ హామీ అమలు చేసేందుకు విధి విధానాలను ప్రకటించాలి. ప్రభుత్వం ఏర్పడి నెలరోజుల గడిచినా ఇంకా ఎటువంటి ప్రకటనా చేయలేదు. నేను ఇంటర్మీడియెట్ చదువుకున్నాను. ఉద్యోగం, ఉపాధి లేకపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వ వెంటనే ఉపాధి కల్పించాలి.

కోలా బాబ్జి, నిరుద్యోగి, దొండవాక, తుని మండలం

ఆశగా ఎదురు చూస్తున్నాను



నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదివాను. పొట్టకూటి కోసం ఇప్పటివరకూ చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునేవాడిని. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇంటికో ఉద్యోగం లేదా ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీతో ఉద్యోగం మానేశాను. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి నెల పైబడినా ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇచ్చే దిశగా అడుగులేయలేదు. ప్రస్తుతం ఉద్యోగం లేదు. మరో చదువు చదువుకోవాలన్నా డబ్బులు లేక ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఏదొక అవకాశం కల్పిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాను.

కె.రాజశేఖర్, నిరుద్యోగి, కొత్తకొట్టాం, కోటనందూరు మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నిరుద్యోగ భృతిపై కూటమి నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుద్యోగ యువతకు భృతి కల్పిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతిపై ఇంతవరకూ ప్రకటన చేయకపోవడం బాధాకరం. డిగ్రీ చదివి ఉద్యోగం లేకపోవడంతో ఖాళీగా ఉన్నాను. త్వరగా భృతి ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– ఏనుగుపల్లి శేఖర్, నిరుద్యోగి, ఇందిరా కాలనీ, ప్రత్తిపాడు

త్వరగా హామీని అమలు చేయాలి



ఎన్నికల్లో కూటమి నేతలు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడిచినా ఆ హామీ ఊసే ఎత్తడం లేదు. గతంలో మాదిరిగా మోసం చేయకుండా జనరల్ అభ్యర్థులతో పాటు అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ప్రభుత్వం వీలైనంత త్వరగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి.

–ఏకుల నూకమణి, తాళ్లూరు, గండేపల్లి మండలం

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి



ఏలేశ్వరంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఏలేశ్వరం: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీడీఓ జె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ అధ్యక్షతన పబ్లిక్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పరిష్కారానికి ఆయాశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్సులో అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, ఏఓ జ్యోతి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు తలుపులమ్మవారికి గణపతి హోమం

తుని రూరల్: ఆషాఢమాసం, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న లోవదేవస్థానంలో కొలువైన తలుపులమ్మ తల్లికి గణపతి హోమం, లక్ష తులసి పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కిర్లంపూడి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్సై జబీర్

కిర్లంపూడి: విద్యార్థులు చదువుల్లో రాణించాలని స్థానిక ఎస్సై షేక్ జబీర్ సూచించారు. కిర్లంపూడి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కాంచనమాల అధ్యక్షతన సోమవారం విద్యార్థులకు ప్రభుత్వ ఉచితంగా అందిస్తున్న పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై షేక్ జబీర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, తూముకుమార్, గుడాల రాంబాబు, కుర్ల చినబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

శంఖవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేయాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపల్లి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. స్థానిక మాదిగపేటలో సోమవారం ఎంఆర్‌పీఎస్ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ బోడపాటి చంటి అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో మాదిగలు కూటమి విజయానికి కృషి చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బోడపాటి తాతాజీ, పలివెల శివమణి, చాత్ర ఇమ్మానియేలు, కండవల్లి శ్రీను పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

జగ్గంపేట: నియోజకవర్గంలోని టెట్, డీఎస్సీ అభ్యర్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించేందుకు అనువైన ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. జగ్గంపేట డిగ్రీ కాలేజీ, కాపు కల్యాణ మండపం, స్టేడియంలోని ఏదో ఒకచోట శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజనం, టీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నెల 17వ తేదీ నుంచి శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పట్టణానికి చెందిన వైద్యుడు ఎస్.విజయబాబు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో కాలుష్యం నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం, చెట్లు నరకడం వంటివి పెరిగిపోయాయని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రణాళిక రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దీనికి పట్టణంలో ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

ఘనంగా ప్లాస్టిక్ సర్జరీ డే

కాకినాడ రూరల్: కాకినాడ ఐడీఏ, అడబాల ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోమవారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డే ఘనంగా నిర్వహించారు. ఐడీఏ రాష్ట్ర సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ప్లాస్టిక్ సర్జరీ ప్రాముఖ్యతను వివరించారు.

అధ్వానంగా ప్రధాన రహదారి



వి.కొత్తూరు కోళ్లఫారాల కాలనీలో బురదమయంగా మారిన రహదారి

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు శివారు కోళ్లఫారాల వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారి ఛిద్రం కావడంతో పాటు బురదమయంగా మారడంతో అటుగా వెళ్లే విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి ఉన్న అర కిలో మీటరు రోడ్డు ఛిద్రం కావడంతో పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల పాఠశాల, కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ పాఠశాలల్లో వెయ్యి మందికిపైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. పిల్లలు కోసం ఆశ్రమ పాఠశాలలకు వచ్చే తల్లిదండ్రులు, ఇళ్లకు వెళ్లొచ్చే విద్యార్థినులు బురదమయంగా ఉన్న రోడ్డుపై నడవలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలని రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానానికి శ్రీకారం



కోటనందూరులో ఇన్‌లైన్ క్లోరినేషన్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



ఇన్‌లైన్ క్లోరినేషన్‌కు ట్యాంకు వద్ద పైపులు వేస్తున్న కార్మికుడు

కోటనందూరు: పంచాయతీ వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రపరచడానికి అధికారులు ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానానికి శ్రీకారం చుట్టారు. ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో కోటనందూరులో వాటర్ ట్యాంకు వద్ద సోమవారం ఈ విధానాన్ని అమలు చేశారు. నీటి కలుషితం కారణంగా డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వాటర్ ట్యాంకులను రోజూ క్లోరినేషన్ చేసిన తరువాతే నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. పంచాయతీల్లో పని చేసే గ్రీన్ అంబాసిడార్లు (స్వీపర్లు) అధిక శాతం వృద్ధులే కావడంతో రోజూ క్లోరినేషన్ చేయడం పెద్ద సమస్యగా మారింది. ఈ తరుణంలో ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. బోరుబావి నుంచి నీటిని ట్యాంకుకు పంపించే సమయంలో అవే గొట్టాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గొట్టాల అమరిక ద్వారా బ్లీచింగ్ ద్రావణాన్ని ట్యాంకుకు పంపిస్తారు. ట్యాంకు నిండిన రెండు గంటల తరువాత పంచాయతీ కుళాయిలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడార్లకు ప్రమాదాలు జరగకుండా ఉండడం, మరొక పక్క ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ఈ విధానానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలంటూ ఆందోళన



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఏలేశ్వరం: ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల హాస్టళ్లల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ పట్టణంలో సోమవారం విద్యార్థులు ఆందోళన చేశారు. ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సతీష్, జిల్లా కన్వీనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ హాస్టళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.160 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్, యూనిఫాం, పుస్తకాలు, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

‘మిషన్ శక్తి’తో మహిళలకు మేలు



రాజపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకంతో పుట్టిన నాటి నుంచి వృద్ధాప్యం వచ్చే వరకూ మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. మండలంలోని రాజపూడి ప్రభుత్వోన్నత పాఠశాలలో మిషన్ శక్తి పథకం, ప్రయోజనాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల స్థితిగతులను బలోపేతం చేసేందుకు మిషన్ శక్తి పథకాన్ని కేంద్రం ప్రారంభించిందన్నారు. మహిళలకు జీవిత కాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం, హింస, బెదిరింపులు లేని ప్రశాంత వాతావరణం కల్పించడంతో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు, రేఖా బులిరాజు, ఐసీడీఎస్ అధికారి దుర్గారాణి, సూపర్ వైజర్ అమ్మాజీ, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి దిగబడిపోయిన ఆర్టీసీ బస్సు



ఒమ్మంగి సమీపంలో రోడ్డు పక్కన దిగబడిపోయిన ఆర్టీసీ బస్సు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి–శరభవరం రోడ్డులో రాజ్ చెరువు కాజ్‌వే వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి దిగబడిపోయింది. శాంతిఆశ్రమం నుంచి కాకినాడ వెళ్తున్న మరో ఆర్టీసీ బస్సుకు దారి ఇచ్చే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన దిగబడిపోయింది. దీంతో రెండు బస్సులు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కొండ చిలువ హతం



రైతుల చేతిలో హతమైన కొండ చిలువ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి శివారు సరుగుతోటలో కొండ చిలువను సోమవారం స్థానిక రైతులు హతం చేశారు. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్న రైతుల కంట కొండ చిలువ పడింది. భయభ్రాంతులకు గురైన రైతులు కర్రలతో కొండ చిలువను కొట్టి హతమార్చారు. శివారు అటవీ ప్రాంతం నుంచి కొండ చిలువ వచ్చిందని స్థానిక రైతులు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలి

ఆర్డీఓ జేవీఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఆర్డీఓ జేవీఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్‌లో స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లపై ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో డివిజన్‌లోని పీహెచ్‌సీల డాక్టర్లు అనూపారాయ్, నిహారిక, అనూష, న్యాయవాదులు కందుల వెంకటాచలం, ఎన్‌జీఓ సభ్యులు వాసవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది

గండేపల్లి: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం...రంపచోడవరానికి చెందిన కేతమాల సూర్యచంద్ర మోటార్ సైకిల్‌పై వడిశలేరు నుంచి కిర్లంపూడి మండలం బూరుగుపూడిలోని అత్తవారింటికి వెళుతున్నాడు. మండలంలోని నీలాద్రిరావుపేట వద్దకు వచ్చే సరికి సిమెంట్ బస్తాలతో జగ్గంపేట వైపు నుంచి వస్తున్న లోడు ఆటో ఒక్కసారిగా మలుపు తిరగడంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సూర్యచంద్ర ఎడమ కాలికి తీవ్రగాయమైంది. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది సతీష్, రాంబాబు క్షతగాత్రునికి తక్షణ సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి రోడ్డు సేఫ్టీ అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.